



పూ్య రీసెర్చి సెంటర్ 2022లో వెలువరించిన నివేదిక ప్రకారం అమెరికాలో **7,25,000** మంది తగిన పత్రాలు లేకుండా అక్రమంగా ఉన్నారు. మెక్సికో, ఎల్ సాల్వడార్ దేశాల తర్వాత మూడో స్థానంలో భారతీయులు ఉన్నారు.

భారత విదేశాంగ శాఖ లెక్కల ప్రకారం 2009 నుంచి 2024 వరకూ దాదాపు 16వేల మంది భారతీయులను అమెరికా వెనక్కి పంపింది.

ట్రంప్ రెండో మారు అధికారం చేపట్టిన తర్వాత 205 మందిని ఒకసారి, 116 మందిని ఒకసారి, 104 మందిని ఇంకోసారి వెనక్కి పంపించారు. నేరస్తుల మాదిరిగా కాళ్లకు చెయిన్లు, చేతులకు బేడీలు వేసి పంపటం బాధితులను ఆవేదనకు గురిచేసింది.



రెండేళ్ల క్రితం రాజ్‌కుమార్ హిరానీ 'డంకీ' పేరుతో ఓ చిత్రం నిర్మించాడు. ఇందులో షారుఖ్ ఖాన్ హీరోగా నటించాడు. ఈ చిత్రం ద్వారా చాలామందికి అమెరికా వెళ్లాలనే ఆకాంక్ష, అందుకు అడ్డదారి ఉందనే అవగాహన పెరిగాయి. దాంతో  మెక్సికో గుండా అమెరికా వెళ్లే వాళ్ల సంఖ్య పెరిగిందని విశ్లేషకులు చెబుతున్నారు. హర్యానాకు చెందిన నిశాంత్ మోర్ ఇలా అడ్డదారుల్లోనే అమెరికాలో అడుగుపెట్టి చివరికి అక్కడ అధికారులకు చిక్కాడు. కానీ కొండలు, గుట్టలు, అడవులు, నదుల మీదుగా సాగిన తన అవస్థల ప్రయాణాన్ని సెల్‌ఫోన్ కెమెరాలో చిత్రీకరించాడు. ఆ తర్వాత ఫోన్‌లోనే ఎడిట్ చేసి ఆరు భాగాల సిరీస్ రూపొందించాడు. దీన్ని వివిధ భాషల్లో డబ్ చేసి సామాజిక మాధ్యమాల్లో అందుబాటులో ఉంచాడు. ఈ ప్రయాణం ఎంత ప్రమాదభరితమైందో అది చూసినప్పుడు అర్థమవుతుంది. అమెరికాలో బహిష్కరణకు గురై ఈ ఏడాది భారత్‌కు తిరిగివచ్చిన వలసదారులు తమ దయనీయ గాథలను ఏకరువు పెట్టారు. హృదయ విదారకమైన ఆ సంఘటనలు ఎవరినైనాసరే ఇట్టే కదిలిస్తాయి.

### ఏటేటా పెరుగుతున్న జనం

అడ్డదారుల్లో అమెరికాలో అడుగుపెడుతున్న వాళ్ల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతూ వస్తున్నది. 2013 ప్రాంతంలో ఈ సంఖ్య నామమాత్రంగా ఉండేది. 2017 తర్వాత.. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే, 2019 తర్వాత నుంచి క్రమేణా పెరుగుతూ వచ్చింది. 2020-21లో 30 వేల మంది భారతీయులు ఈ ప్రయత్నం చేస్తే, మరుసటి ఏడాదే ఆ సంఖ్య రెట్టింపై 63,000కు చేరింది. అక్టోబరు 2022, సెప్టెంబరు 2023 మధ్య ఈ సంఖ్య 96,000కు చేరింది. ఇందులో ముప్పైవేల మంది కెనడాలో పట్టుబడితే, నలభై ఒక్కవేల మంది మెక్సికోలో దొరికిపోయారు. ఇది ఒక్క భారతదేశానికి మాత్రమే పరిమితమైన వ్యవహారం కాదు. అనేక దేశాలకు చెందిన వారు డంకీ పద్ధతిలోనే అమెరికాలో అడుగుపెడుతున్నారు. ఇలా భారత్ కంటే ఎక్కువ సంఖ్యలో వెళ్తున్న వాళ్లలో అమెరికా సరిహద్దు పంచుకున్న మెక్సికో దేశస్తులూ ఉన్నారు. ఆసియా ఖండపు దేశాల్లో మాత్రం భారత్‌దే పైచేయి.

### నిరుద్యోగమే కారణమా?

భారత్‌లో నిరుద్యోగ సమస్య కారణంగానే ఎక్కువ మంది అమెరికా వైపు చూస్తున్నారని నిపుణులు చెబుతు

## అధికారుల లెక్కల్లో..

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి నెలలో..  అంటే 2025 ఫిబ్రవరిలో దాదాపు 11వేల మంది అక్రమ వలసదారులను వెనక్కి పంపామని ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ప్రకటించింది. 2024 ఫిబ్రవరిలో బైడెన్ హయాంలో వెనక్కి పంపిన వారికంటే ఈ సంఖ్య తక్కువని కొన్ని అమెరికన్ పత్రికలు కథనాలు ప్రచురించాయి. అప్పట్లో 12 వేల మందిని వెనక్కి పంపారు. దీనికి సంబంధించి ట్రంప్ ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఈ ఏడాదితో పోలిస్తే గత ఏడాది బోర్డర్ క్రాసింగ్స్ అధికంగా ఉండేవి. అక్కడికక్కడే వాళ్లను అరెస్టు చేసి పంపించేవారు. అమెరికాలో అడుగుపెట్టనిచ్చి విచారణల అనంతరం వెనక్కిపంపటం కంటే అప్పటికప్పుడు పంపేయటం సులువు. అలా చూసుకున్నప్పుడు బైడెన్ హయాంలో 2,100 మందిని పంపితే, ఇప్పుడు 4,300 వలసదారులను వెనక్కి పంపామని ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది.